క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ డీఎం'

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ పి.శివాజీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గన్నవరం డిపో నుంచి నడుపుతున్న బస్సు సర్వీస్‌లకు సంబంధించి విలువైన సూచనలు, సలహాలు, సమస్యలను 87909 96090 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతురాలి కుటుంబానికి వంశీమోహన్ పరామర్శ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం రేమల్లేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ ఢీ కొట్టి దుర్మరణం చెందిన మన్నెం సుశీలమ్మ మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ శుక్రవారం సందర్శించారు. సుశీలమ్మ భౌతికకాయానికి నివాళులర్పించి, ఆమె అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతిరాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జేసీఎస్ మండల కన్వీనర్ ఆవిర్నేని శేషగిరిరావు, నాయకులు పాల్గొన్నారు.

పోరంకిలో బంగారం, నగదు చోరీ

పెనమలూరు: పోరంకిలో చోరీ జరిగిన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి గ్రామం నిడమానూరు రోడ్డుకు చెందిన ఎస్.వెంకట నారాయణ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 19న హైదరాబాద్‌కు వెళ్లాడు. అయితే రెండు రోజుల క్రితం ఇంట్లో మొక్కలకు నీరు పోయటానికి వచ్చిన బంధువు ఇంటి తలుపు తాళం పగులగొట్టి ఉండటంతో వెంటనే వెంకటనారాయణకు సమాచారం ఇచ్చాడు. దీంతో వెంకట నారాయణ హైదరాబాద్ నుంచి వచ్చి ఇంట్లో పరిశీలించగా రూ.40 వేలు, బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు గుర్తించాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

వైభవంగా ఊంజల్ సేవ



గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో వేం చేసి ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఊంజల్ సేవ కార్యక్రమం నిర్వహించారు. శ్రీసీతారాముల కల్యాణం జరిగి పదహారు రోజులు పూర్తయ్యిన సందర్భంగా ఆలయ అర్చకుడు ఎస్.రామాచార్యులు నేతృత్వంలో ఈ వేడుక జరిపారు. తొలుత స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాహచనం, విశేష అర్చనలు నిర్వహించారు. భక్తులచే శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, ద్వాదశ ప్రదక్షిణలు జరిపారు. అనంతరం భక్తుల గీతాలాపన మధ్య శ్రీసీతారామచంద్ర స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన చేశారు. పలువురు పుర ప్రముఖులు, పరిసరా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి గీతా మందిర వార్షికోత్సవం



పెనమలూరు: కానూరులో శుక్రవారం సాయి గీతామందిరం 26వ వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున 5.15 గంటలకు కాగడా హారతి, 6.10 గంటలకు 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం, ఉదయం 8.30 గంటలకు పల్లకీపూజ, అనంతరం మల్లెలార్చన, మధ్యాహ్నం 12 గంటలకు హారతి బాబాకు ఇచ్చారు. తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ వెంకటేశ్వరరావు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు షిర్డి సాయి బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఐదు వేల మంది భక్తులను అన్నసమారాధన నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

బూటకపు మాటలు నమ్మి మోసపోవద్దు

- వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ రాజ్యం
- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్



పునాదిపాడులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

కంకిపాడు: అధికారమే లక్ష్యంగా బూటకపు మాటలు, వెన్నుపోటు రాజకీయాలతో మోసగాళ్లు వస్తున్నారని వారిని విశ్వసించవద్దని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పాలన, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సాగిస్తున్న అక్రమాలు, అరాచకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమం కొనసాగాలంటే, పేదలు సంతోషంగా, సగర్వంగా బతకాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్ సీపీకి మళ్లీ అవకాశం ఇవ్వాలి..

ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ప్రజలు సంతోషంగా ఉండటాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ హయాంలోనే ముఖ్యమంత్రి జగనన్న సంక్షేమాన్ని అన్ని వర్గాలకు చేరువ చేశారన్నారు. దేశం యావత్తూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం వైపు చూస్తుంటే ప్రతిపక్షాలు గుంట నక్కల రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. వెన్నుపోటుకు కేరాఫ్ అయిన చంద్రబాబు, మెచ్యూరిటీ లేని జనసేన అధినేత పవన్, బీజేపీతో కలిసి ప్రజల్లోకి వస్తున్నారన్నారు. మాయమాటలతో మోసం చేయాలని చూస్తున్నారన్నారు. వాస్తవాలను గమనించి సంక్షేమ రాజ్యం కోసం వైఎస్సార్ సీపీకి మళ్లీ అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ విజయం అందించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, పార్టీ నేతలు చలసాని స్మిత గౌతమ్, జి.చిట్టిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, ఉమెన్



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న జోగి రమేష్



ఉయ్యూరులో పూజలు చేస్తున్న జోగి రమేష్

ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి, సర్పంచ్‌లు సీహెచ్ ఆదర్శకుమార్, బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, మేరుగు విజయ చంద్రశేఖర్, ఎంపీటీసీలు కోనా కిషోర్, చిట్టూరి ప్రసాద్, మైనార్టీ నేత షేక్ చిన్నా, సొసైటీ చైర్మన్లు వీరంకి నరేష్, వీర్ల జగపతి, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, నాయకులు పిడికిటి రామకోటేశ్వరరావు, తొడుసు శ్రీను, సంసోన్, గుడ్డేటి రాజా, బీహెచ్ రాజగోపాల్‌రెడ్డి, తంబాబత్తుల ఓంకారం, కలపాల వజ్రాలు, జి.కోటేశ్వరరావు, బందెల సుబ్బారావు పాల్గొన్నారు.

ఉయ్యూరులో ప్రచారం

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలోని పలు వార్డుల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్ శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందించాలని కోరారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తూ దేశంలోనే తెలుగు ప్రజలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేనన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి ప్రజలను బానిసలుగా మార్చేందుకు చంద్రబాబు, పవన్, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయని ధ్వజమెత్తారు. వెన్నుపోటుకు కేరాఫ్ అయిన చంద్రబాబుకి విశ్వసిస్తే మోసపోయినట్లేనని, జగనన్ననే మళ్లీ సీఎం చేసుకుని సంక్షేమ ఫలాలను పొందుదామని చెప్పారు. 11వ వార్డు ఇన్‌చార్జిలు అబ్దుల్ గఫూర్, గౌరి నాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలి

రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్

కంకిపాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని, విజయకేతనం ఎగురవేసేందుకు సిద్ధం కావాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు అభ్యర్థి జోగి రమేష్ పిలుపునిచ్చారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలో సిద్ధం సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను బూత్ కమిటీ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలన్నారు. ప్రజలను చైతన్యవంతం చేయాలని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు వైఎస్సార్ సీపీకి పడేలా కంకణబద్ధులై పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కూటమి పేరుతో ప్రజలను గందరగోళానికి గురిచేసేందుకు దొంగల ముఠా రాష్ట్రంలో తిరుగుతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఎంతమంది తోడుదొంగలు, మోసగాళ్లు కలిసొచ్చినా కూటమికి ఓటమి తప్పదన్నారు. రాష్ట్రంలో, పెనమలూరు గడ్డపైనా వైఎస్సార్ సీపీ విజయ కేతనం ఖాయమని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ నేతలు చలసాని స్మిత గౌతమ్, జి.చిట్టిబాబు ప్రసంగించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాకీ బాబు, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, నాయకులు తంబాబత్తుల ఓంకారం, పిడికిటి రామకోటేశ్వరరావు, బందెల సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు వీర్ల జగపతి పాల్గొన్నారు.

జగనన్నతోనే నాయీ బ్రాహ్మణుల సంక్షేమం

పెనమలూరు: జగనన్నతోనే నాయీ బ్రాహ్మణుల సంక్షేమం సాధ్యమవుతుందని జిల్లా నాయీబ్రాహ్మణ సంఘ నాయకుడు ప్రాకర్ల వేణుబాబు తెలిపారు. గంగూరులోని పెనమలూరు



పునాదిపాడు సిద్ధం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్



జోగి రమేష్‌కు మద్దతు తెలుపుతున్న నాయీ బ్రాహ్మణ సంఘ నేతలు

నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం నాయీబ్రాహ్మణ సంఘ నేతలు మంత్రి, పెనమలూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి జోగి రమేష్‌ను కలిసి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వేణుబాబు మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వంలో నాయీ బ్రాహ్మణులకు ఎంతగానో న్యాయం జరిగిందన్నారు. గతంలో నాయీ బ్రాహ్మణులు సేవకులుగానే ఉండేవారని, అయితే జగనన్నపాలనలో నాయీబ్రాహ్మణులు పాలకులుగా మారారని చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలిలో నాయీ బ్రాహ్మణులకు సభ్యులుగా అవకాశం ఇచ్చారన్నారు. జోగి రమేష్ గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆముదాలపల్లి సుబ్రహ్మణ్యం, పావులూరు వెంకటేశ్వరరావు, నిడుమోలు ఏసుబాబు, తెన్నేటి ప్రకాష్, కొల్లూరు శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, చంద్రశేఖర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

నున్న చెక్‌పోస్టులో ముమ్మరంగా తనిఖీలు



నున్న(విజయవాడరూరల్): ఎన్నికల నేపథ్యంలో నున్న గ్రామంలోని పవర్‌గ్రిడ్ వద్ద చెక్‌పోస్టులో తనిఖీలను అధికారులు ముమ్మరం చేశారు. విజయవాడ వైపు నుంచి నూజివీడు, అలాగే సత్తుపల్లి, విసన్నపేట, ఏలూరు ప్రాంతాల నుంచి విజయవాడ వైపు రాకపోకలు సాగిస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులతో పాటు అన్ని వాహనాలను తనిఖీ చేస్తున్నారు. బస్సుల్లో ప్రయాణికుల బ్యాగులను పరిశీలిస్తున్నారు. మూడు రోజుల క్రితం తెలంగాణకు చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి నుంచి రూ.4.50 లక్షలను ఆర్టీసీ బస్సులో పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి ప్రతి ఆర్టీసీ బస్సును తనిఖీ చేస్తున్నారు. అన్ని వాహనాలను తనిఖీ చేస్తున్నట్టు నున్న సీఐ ఎస్.దుర్గాప్రసాద్ తెలిపారు.

29న మండల పరిషత్ సమావేశం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

జగనన్న సంక్షేమ పథకాలే విజయం చేకూరుస్తాయి



ప్రసాదంపాడులో ప్రచారం నిర్వహిస్తున్న కొమ్మా కోట్లు, ప్రజాప్రతినిధులు

రామవరప్పాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే రెండో సారి సీఎంగా జగన్‌కు అఖండ విజయం చేకూరుస్తాయని గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని ట్రాన్స్‌ఫారం వీధి, మొక్కపాటి టవర్స్ ఏరియా, కస్తూరి స్కూల్ రోడ్డు, సాయి బాబా ఆలయ ప్రాంతంలో వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, ఎంపీటీసీలు, నాయకులతో కలిసి కొమ్మా కోట్లు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు.

కూటమికి ఘోర పరాజయం తప్పదు

ఈ సందర్భంగా కోట్లు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి వల్లభనేని వంశీమోహన్ విశేష కృషి చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వంశీను హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో కనబడే వలస వచ్చిన టీడీపీ నాయకుల దొంగ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలు చూడకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. రాష్ట్ర ప్రజలంతా మంచి చేసిన సీఎం జగన్‌వైపే ఉన్నారని ఎవరెన్ని కుట్రలు పన్నినా కూటమికు ఘోర పరాజయం తప్పదన్నారు. రామవరప్పాడు సొసైటీ బ్యాంకు చైర్మన్ సాదం వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు దూరు రత్నం, పైలా లక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ చెన్ను కమల్ రాజు, యూత్ నాయకులు పిన్నిబోయిన రవి కుమార్, సర్నాల రవి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రజలకు రక్షణ



యనమలకుదురులో ప్రచారం నిర్వహిస్తున్న జోగి రాజీవ్

పెనమలూరు: రాష్ట్రంలో జగనన్న పాలనలో ప్రజలకు రక్షణ కలుగుతుందని మంత్రి జోగి రమేష్ తనయులు జోగి రాజీవ్, జోగి రోహిత్ అన్నారు. యనమలకుదురు గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ మాట్లాడుతూ జగన్ అధికారం చేపట్టిన తరువాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద, మధ్య తరగతి కుటుంబాలకు రక్షణ లభించిందన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ఆయా కుటుంబాలను ఆర్థికంగా ఆదుకున్నారని తెలిపారు. పేదల ఆత్మగౌరవాన్ని జగనన్న కాపాడారన్నారు. ఈ ఎన్నికల్లో జగనన్నను తిరిగి గెలిపిస్తే పేదలు ఆత్మస్థైర్యంతో జీవించగలుగుతారని చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సింహాద్రి చంద్రశేఖరరావు, జోగి రమేష్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి, అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, నాయకులు అమీర్, ఈడే గోపాల కృష్ణ, ముస్తఫా, పరుశురామ్, దశమంతరావు, గుమ్మడి అన్వేష్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకం

గన్నవరం: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. నియోజకవర్గంలో ఓటర్లు 2,79,054 ఉండగా, వీరిలో పురుషులు 1,34,226, మహిళలు 1,44,816, థర్డ్ జెండర్స్ 12 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లలో పురుషులు కంటే మహిళ ఓటర్లే 10,590 మంది అధికంగా ఉన్నారు. మండలాల వారీగా విజయవాడ రూరల్‌లో 88,878, గన్నవరంలో 74,382, బాపులపాడులో 71,954, ఉంగుటూరులో 43,840 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 308 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. రానున్న ఎన్నికల కోసం ఇప్పటి నుంచే పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

తుది ఓటర్ల జాబితా ప్రకటన

పెనమలూరు: సాధారణ ఎన్నికలకు సంబంధించి పెనమలూరు నియోజకవర్గం తుది ఓటర్ల జాబితాను అధికారులు ప్రకటించారు. గతంతో పోల్చుకుంటే పెనమలూరులో ఓటర్లు పెరిగారు. ప్రస్తుతం మొత్తం 2,94,928 మంది ఓటర్లు ఉన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో తాడిగడప మున్సిపాలిటీ, పెనమలూరు, ఉయ్యూరు, కంకిపాడు మండలాల్లో ... పోలింగ్ కేంద్రాలు 304 ఉన్నాయి. తాడిగడప మున్సిపాలిటీలో అత్యధికంగా ఓటర్లు ఉన్నారు.

గన్నవరం నియోజకవర్గంలోని ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్స్	మొత్తం
విజయవాడ రూరల్	43,271	45,603	4	88,878
గన్నవరం	35,524	38,853	5	74,382
బాపులపాడు	34,562	37,391	1	71,954
ఉంగుటూరు	20,869	22,969	2	43,840
	1,34,226	1,44,816	12	2,79,054

మహిళా ఓటర్లు అధికం

పెనమలూరు నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. పురుష ఓటర్లు 1,42,349 మంది ఉండగా మహిళా ఓటర్లు 1,52,577 మంది ఉన్నారు. పురుష ఓటర్లు కంటే మహిళా ఓటర్లు 13,228 మంది ఎక్కువ ఉన్నారు. పెనమలూరులో 5,034 మంది మహిళలు అధికంగా ఉన్నారు. అదే విధంగా కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో కూడా మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

పెనమలూరు కీలకం

ఈ ఎన్నికల్లో పెనమలూరు ఓటర్లు అత్యంత కీలకంగా ఉన్నారు. పెనమలూరులో(తాడిగడప కలుపుకోని) మొత్తం ఓటర్లు 1,76,317 మంది ఉన్నారు. కంకిపాడు, ఉయ్యూరు కలిపి మొత్తం ఓటర్లు 1,18,611 మంది మాత్రమే ఉన్నారు. పెనమలూరులో ఓటర్లు గెలుపు ఓటములను నిర్ణయించే అవకాశం ఉంది.

మండలం	పీఎస్	పురుషులు	మహిళలు	టీజీ	మొత్తం ఓట్లు
తాడిగడప మున్సిపాలిటీ	124	67,016	70,282	1	1,37,299
పెనమలూరు	42	18,625	20,393	0	39,018
కంకిపాడు	64	26,367	29,042	1	55,410
ఉయ్యూరు అర్బన్	37	15,927	17,155	0	33,060
ఉయ్యూరు రూరల్	37	14,414	15,705	0	30,141
మొత్తం	304	1,42,349	1,52,577	2	2,94,928

సంక్షేమ పాలనకు ప్రజలు పట్టం కట్టాలి



కానుమోలులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని ఆ పార్టీ నాయకులు కోరారు. బాపులపాడు మండలం కానుమోలులో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొండపల్లి హరిబాబు, ఎనికేపల్లి శ్రీనివాసరావు, మద్రాపు కిరణ్ కుమార్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. వలంటీర్లు, గ్రామ సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేసి ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిందని గుర్తు చేశారు. వృద్ధులకు ప్రతినెల ఒకటో తేది తెల్లవారుజామునే ఇంటికి వచ్చి వలంటీర్లు పెన్షన్లు పంపిణీ చేశారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన, జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి, డిజిటల్ క్లాస్‌రూంలు, ఆధునిక ట్యాబ్‌లు, టాయిలెట్లు వంటి సౌకర్యాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెల్లుతుందన్నారు. కుల, మత, రాజకీయ పక్షపాతం లేకుండా అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించారని పేర్కొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును, వల్లభనేని వంశీమోహన్‌ను గెలిపించుకునేందుకు ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. పార్టీ నాయకులు అంబళ్ల కిట్టు, సుబ్బారావు, రెడ్డి బాబు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ బలగాలతో కవాతు



రామవరప్పాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని రాజుల బజారు, కాపుల బజారు, బల్లెంవారి వీధిల్లో శుక్రవారం పటమట పోలీస్‌స్టేషన్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సెంట్రల్ ఏసీపీ భాస్కర్‌రావు నేతృత్వంలో శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం కవాతును చేపట్టారు. ప్రజలు స్వచ్ఛందంగా ఓటును వినియోగించుకోవాలని అవగాహన పరుస్తూ, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మేమున్నామన్న భరోసా ప్రజలకు కల్పిస్తూ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పటమట సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నున్నలో ఫ్లాగ్‌మార్చ్

నున్న(విజయవాడరూరల్): ప్రజలు తమ ఓటును నిర్భయంగా వేయాలని ప్రజలకు పోలీసులు భరోసానిస్తూ శుక్రవారం నున్న గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి రామకృష్ణ ఆదేశాల మేరకు నున్న గ్రామంలో లైబ్రరీసెంటర్, పడమర బజారు, గౌడబజారు, కుమ్మరిబజారు, కోటకట్ట సెంటర్, వికాస్ కాలేజీ రోడ్డు, బోడపాడు పరిసర

ముగిసిన నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ

గన్నవరం: గన్నవరం, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. నామినేషన్ల పరిశీలన అనంతరం ఎమ్మెల్యే ఎన్నికల బరిలో 14 మంది అభ్యర్థులు నిలిచారు. తొలుత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ నేతృత్వంలో నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ ప్రారంభించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 24 మంది అభ్యర్థులు దాఖలు చేసిన 34 సెట్ల నామినేషన్ల పత్రాలను క్షుణంగా పరిశీలించారు. స్క్రూటినీ అనంతరం 10 మంది అభ్యర్థుల నామినేషన్ పత్రాలను వివిధ కారణాలు వల్ల ఆర్వో తిరస్కరించారు. మిగిలిన 14 మంది అభ్యర్థులు నామినేషన్లు ఆమోదం తెలిపారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పవన్‌కుమార్, పలువురు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. తొలుత వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ నామినేషన్ పత్రాలు విషయంలో టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే పూర్తిస్థాయి పరిశీలన తర్వాత ఆర్వో నామినేషన్ పత్రాలు సక్రమంగానే ఉన్నట్లుగా ధ్రువీకరించారు.

అమోదం పొందిన నామినేషన్లు..

డాక్టర్ వల్లభనేని వంశీమోహన్(వైఎస్సార్ సీపీ), కళ్లం వెంకటేశ్వరరావు(సీపీఎం), యార్లగడ్డ వెంకట్రావు(టీడీపీ), సింహాద్రి రాఘవేంద్రరావు(బీఎస్పీ), పైలా అజయ్(నవరంగ్ కాంగ్రెస్), తాడంకి జగదీష్‌రామచంద్రరావు(తెలుగు రాజ్యాధికార పార్టీ), దొండపాటి ఆనంద్‌ప్రసాద్(ఆల్ ఇండియా ఫార్వర్డ్), పొట్లూరి రవీంద్రకుమార్(రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా), స్వతంత్ర అభ్యర్థులు ప్రత్తిపాటి అరుణకుమారి, కొర్రపోలు శ్రీనివాసరావు, గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, పొట్లూరి శ్రీదేవి, వల్లభనేని మోహన్ వంశీకృష్ణ, సర్నాల విజయదుర్గ.

12 నామినేషన్ల ఆమోదం

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో దాఖలైన నామినేషన్లలో ఐదు నామినేషన్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రాజు పరిశీలన అనంతరం తిరస్కరించారు. పెనమలూరు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో శుక్రవారం నామినేషన్లు పరిశీలించారు. మొత్తం 17 నామినేషన్లు అందగా అందులో నామినేషన్‌లు సక్రమంగా పూర్తి చేయని ఐదు నామినేషన్లు తిరస్కరించామన్నారు. మిగతా 12 నామినేషన్లను ఆమోదించారు. ప్రధాన పోటీదారులు వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్ , టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ నామినేషన్లు రిటర్నింగ్ అధికారి ఆమోదించిన వాటిలో ఉన్నాయి. ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని, అదే రోజు అభ్యర్థుల ఎన్నికల గుర్తులు ప్రకటిస్తామని రిటర్నింగ్ అధికారి డి.రాజు తెలిపారు.

తిరస్కరించిన నామినేషన్లు ఇవే

సాంకేతిక కారణాల వలన రిటర్నింగ్ అధికారి తిరస్కరించిన నామినేషన్ల వివరాలు ఆర్వో రాజు వెల్లడించారు. వైఎస్సార్ సీపీ నుంచి జోగి రాజీవ్, టీడీపీ నుంచి బోడె హేమాచౌదరి, జాతీయ జనసేన అభ్యర్థి జి.సీతారామయ్య, జై భారత్ నేషన్ పార్టీ అభ్యర్థి లంకా కరుణాకర్‌దాస్, స్వతంత్ర అభ్యర్థి డి.సతీష్ నామినేషన్లు తిరస్కరించారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

ఆర్ఎసిపిసి-II, డోర్ నెం: 59-13-4, ఘంటసాలవారి వీధి, గాయత్రి నగర్, విజయవాడ-520008

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని 13(2) క్రింద దిగువ వారికి

1) [illegible] కృష్ణ, [illegible] వెంకటేశ్వరరావు. డోర్ నెం.11-119, [illegible], కంకిపాడు, [illegible]-521151

2) [illegible] డోర్ నెం. 10/70 [illegible]-521151

హామీదారు: [illegible] డోర్ నెం.76-13-14/8, [illegible] కృష్ణా జిల్లా-520012.

హౌసింగ్ లోన్ అకౌంట్ నెం: 40001904564 & సురక్ష అకౌంట్ నెం: 40001996288, [illegible] అకౌంట్ నెం: 38147707828.

మేడమ్ / సార్,

[illegible] తేది 12-04-2024 [illegible] రూ.32,65,474/- (30,39,738/- + 2,25,736/-) [illegible]

తనఖా పెట్టిన స్థిరాస్తి వివరము

కృష్ణా జిల్లా, కంకిపాడు గ్రామం & మండలం, [illegible] ఆర్‌ఎస్ నెం. 177/3, 177/4, [illegible] 58-1671/06, [illegible] నెం. 9/2007, ఫ్లాట్ నెం. 1, డోర్ నెం. 4-74, అపార్ట్‌మెంట్ నెం. 674, [illegible] ఫ్లాట్ నెం. 504, 4వ అంతస్తు, 975 చదరపుగుల [illegible] 250 చదరపుగుల [illegible] 100 చదరపుగుల [illegible] 1170 [illegible] 32 [illegible] నెం. 1594/2021, తేది: 18-03-2021, కంకిపాడు [illegible], విజయవాడ, కృష్ణా జిల్లా. అపార్ట్‌మెంట్ హద్దులు: [illegible] సర్వే నెం. 178, [illegible] 40 [illegible]

ఫ్లాట్ నెం.501 హద్దులు: [illegible]

[illegible] 13(2) క్రింద ది.12-01-2024న తేదీన డిమాండ్ నోటీసును [illegible] 60 [illegible] సెక్షన్ 13(4) [illegible] SARFAESI చట్టం, 2002 [illegible]

తేది : 26-04-2024

ప్రదేశం : విజయవాడ

అధీకృత అధికారి

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా